


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL | ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | మంగళవారం 16-08-2022 | సంపుటి : 04 | సంచిక : 01 | పేజీలు : 4 | వెల : రూ 3-00


# ఇలాంటి సమాధానాల అన్వేషణే మన మూడేళ్ల పాలన: సీఎం జగన్



విజయవాడ ,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ప్రభుత్వం నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. దీనిలో భాగంగా ముందుగా జాతీయ జెండా ఆవిష్కరించారు సీఎం జగన్. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఆపై తన అద్భుతమైన ప్రసంగంతో సీఎం జగన్ ఆకట్టుకున్నారు.అంతర్జాతీయంగా భారత్ సాధించిన విజయాలకు కొదవ లేదన్నది ఎంత వాస్తవమో, దేశంగా ఇండియాకు వచ్చిన ఈ స్వతంత్రం... వ్యక్తులుగా, కులాలుగా, ప్రాంతాలుగా, జెండర్లగా తమకు పూర్తిగా అందలేదన్న భావన కొన్ని సమూహాల్లో, కొన్ని ప్రాంతాల్లో, అనేకమంది ప్రజల్లో నేటికీ ఉండిపోయిందన్నది కూడా అంతే వాస్తవమన్నారు.దేశ స్వాతంత్రానికి 75 ఏళ్ల చరిత్ర ఉంటే... మరోవంక, సమ సమాజం కోసం, సామాజిక న్యాయం కోసం, చదువుకునే హక్కు కోసం, మహిళల సమాన హక్కుల కోసం, మనుషులుగా గుర్తింపు కోసం, దోపిడీకి గురి కాకుండా జీవించే రక్షణల కోసం... ఈ గడ్డమీద జరుగుతున్న పోరాటాలకు వందలూ వేల ఏళ్ళ చరిత్ర ఉందని సీఎం జగన్ మరోసారి గుర్తు చేశారు. ఇవన్నీ పరాయి దేశం మీద మనం చేసిన స్వాతంత్ర్య పోరాటాలు కావని, ఇవన్నీ మన సమాజంలో జరుగుతున్న సామాజిక స్వాతంత్ర్య పోరాటాలన్నారు. ఈ పోరాటాల్లో కొన్ని సంఘ సంస్కరణ పోరాటాలు!ఇందులో కొన్ని సమాన హక్కుల పోరాటాలు! మరి కొన్ని అణచివేతల మీద మాట్లాడకపోయినా, మనం తిరుగుబాట్లు! ఇవన్నీ మనం దాచేసినా దాగని సత్యాలు! ఇవన్ని నిజానికి... మనం నిండు మనసుతో చేసుకోవాల్సిన దిద్దుబాట్లు అని అన్నారు. ఇలాంటి సమాధానాల అన్వేషణే ఆంధ్రప్రదేశ్ లో మన మూడేళ్ల పాలన అని సీఎం జగన్ పేర్కొన్నారు.ఆహారాన్ని పండించే రైతు అర్ధాకలితో ఉండటాన్ని...భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలు తరతరాలుగా గుడిసెల్లో మాత్రమే జీవించటాన్ని...గవర్నమెంటు బడికి వెళ్ళే పేదల పిల్లలు కేవలం తెలుగు మీడియంలోనే చదవక తప్పని పరిస్థితిని...ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాలు ఎప్పటికీ పనివాళ్ళుగా మిగిలిపోవాలనే పెత్తందారీ పోకడల్ని... – వైద్యం ఖర్చు భరించలేక, అమ్ముకునేందుకు ఏమీలేక... అప్పటికే అప్పులపాలై నిస్సహాయంగా చనిపోవటాన్ని...చదువులకు అయ్యే ఖర్చు భరించలేక పిల్లల్ని చదువులు మాన్పించి పనిలో పెట్టాల్సివస్తే తల్లి హృదయం తల్లడిల్లటాన్ని... ఎస్సీల్లో 36 శాతం, ఎస్టీల్లో 51 శాతం నేటికీ నిరక్షరాస్యులుగానే మిగిలిపోవటాన్ని...కార్పొరేట్ విద్యా సంస్థల కోసం, అంతకంటే మెరుగైన టీచర్లు ఉన్న ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలి పెట్టటాన్ని...మనలో సగం ఉన్న అక్కచెల్లెమ్మలకు, వారి వాటాగా సగం ఉద్యోగాలు, సగం పదవులు, చట్ట సభల్లో సగం స్థానాలు కేటాయించకపోవటాన్ని... –కొన్ని సామాజిక వర్గాల వారికి అధికార పదవుల్లో, పరిపాలనలో ఏనాటికీ వాటా దక్కకపోవటాన్ని...సంపద కేంద్రీకరణ ధోరణులకు తోడుగా, అధికార కేంద్రాలన్నీ ఒకే చోట ఉండాలన్న వాదనల్ని... గ్రామాల్లో ప్రభుత్వ సేవల విస్తరణ చేయకుండా పల్లెల్ని, రైతుల్ని గాలికి వదిలేయటాన్ని...ప్రతి పనికీ లంచాలు, కమిషన్ల వ్యవస్థ ఏర్పడటాన్ని...ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకపోవటం ద్వారా రాజకీయ పార్టీలు ఆయా వర్గాలకు చేసిన నష్టాన్ని...ఇలాంటి దుర్మార్గాలన్నింటినీ, మన స్వతంత్ర దేశంలో... మన దేశం వాడే, మన రాష్ట్రం వాడే... మన ప్రజలకు అన్యాయం చేస్తూ దాన్నే పరిపాలన అంటాడని... ఇండిపెండెంట్‌గా ఉండాల్సిన మీడియా, తమ స్వార్థ ప్రయోజనాల కోసం దానికి భజన చేస్తుందని మన స్వాతంత్ర్య సమర యోధులు, మన రాజ్యాంగ నిర్మాతలు ఏనాడైనా ఊహించారాఇవన్నీ మన ముందున్న ప్రశ్నలు. దశాబ్దాలుగా అనేక వర్గాల అనుభవాలనుంచి, ఆయా వర్గాలకు జరిగిన అన్యాయాలనుంచి పుట్టిన ఈ ప్రశ్నలకు... మనందరి ప్రభుత్వంలో, గత మూడేళ్ళ పాలనతో... సాధ్యమైనంత మేరకు, శక్తి వంచన లేకుండా... సమాధానం ఇవ్వగలిగామని సగర్వంగా తెలియజేస్తున్నాను!మన గ్రామానికి, మన నగరానికి అందే పౌర సేవల్లో మార్పులు తీసుకువచ్చాం1వ తేదీన సూర్యోదయానికి ముందే అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు వారి తలుపు తట్టి చిరునవ్వుతో గుడ్మార్నింగ్ చెప్పి మరీ... ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోకుండా, 2.7 లక్షల మంది వాలంటీర్లు ఇంటికి వచ్చి ఇచ్చి వెళ్ళే వ్యవస్థ ఏర్పాటు చేశాం! –ప్రతి 2000 మందికి పౌర సేవలు అందించే గ్రామ/వార్డు సచివాలయం; అక్కడి నుంచి నాలుగు అడుగులు వేస్తే రైతులకు విత్తనం నుంచి పంట అమ్మకం వరకు అన్ని విధాలా సహాయం చేసే రైతు భరోసా కేంద్రాలు... అక్కడినుంచి మరో నాలుగు అడుగులు వేస్తే కనిపించే వైఎస్సార్ విలేజి క్లినిక్కు... ఇంకో నాలుగు అడుగులు వేస్తే కనిపించే ఇంగ్లీష్ మీడియం స్కూల్...మరో నాలుగు అడుగుల దూరంలోనే మీ గ్రామంలోనే నిర్మాణం కాబోతున్న డిజిటల్ గ్రంథాలయాలు, మరో నాలుగు అడుగుల దూరంలో ఇంగ్లీష్ లో బోధించే ప్రీ ప్రైమరీలు, ఫౌండేషన్ స్కూళ్ళు... ప్రతి మండలానికీ ఒక అధునాతన 108, ప్రతి పీహెచ్సీకీ ఒక అధునాతన 104... అందులో ఇద్దరు డాక్టర్లు; వీరిని విలేజి క్లినిక్తో అనుసంధానించి అమలు కానున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్...పరిపాలనను మరింత చేరువ చేస్తూ, పర్యవేక్షణను మరింత మెరుగుపరుస్తూ...గ్రామాలూ నగరాల్లో మార్పులే కాక, గత ఏడాది వరకు కేవలం 13 జిల్లాలుంటే... మరో 13 జిల్లాల ఏర్పాటు ద్వారా పరిపాలన వికేంద్రీకరణలో మరో అధ్యాయాన్ని ఆరంభించాం. రాజధాని స్థాయిలో పరిపాలన వికేంద్రీకరణే మా విధానం అని... ప్రాంతీయ ఆకాంక్షలకు, ప్రాంతాల ఆత్మ గౌరవానికి, అన్ని ప్రాంతాల మధ్య సమతౌల్యంతోపాటు పటిష్ఠ బంధానికి ఇదే పునాది అని గట్టిగా నమ్మి అడుగులు వేస్తున్నాం. అన్నంపెట్టే రైతన్నకు అండగా... వ్యవసాయానికి సాయంగా...వైఎస్సార్ రైతు భరోసాతో ఏకంగా 52 లక్షల రైతు కుటుంబాలకు ఏటా రూ. 13,500 చొప్పున సహాయం అందిస్తున్నాం. రైతు భరోసా కేంద్రాలను గ్రామ స్థాయిలో తీసుకువచ్చి... ఈ–క్రాప్ మొదలు, ఉచిత పంటల బీమా, ఏ సీజన్ లో నష్టాన్ని ఆ సీజన్ ముగిసేలోగానే అంచనా వేసి ఇన్పుట్ సబ్సిడీ అందించటం, సున్నా వడ్డీ పంట రుణాలు, పగటి పూటే 9 గంటలు నాణ్యమై ఉచిత విద్యుత్తు వంటివి అందిస్తూ... ఈ మూడేళ్లలో రైతు ప్రభుత్వంగా రైతు సంక్షేమానికి మనం చేసిన ఖర్చు... ఏకం రూ. 83 వేల కోట్లు! ఇది కాక, ధాన్యం సేకరణమీద చేసిన వ్యయం మరో రూ. 44 వేల కోట్లకు పైగానే! మొత్తంగా ఈ మూడేళ్లలో మనందరి ప్రభుత్వం కేవలం వ్యయవసాయం మీద చేసిన ఖర్చు ఏకంగా రూ. 1.27 లక్షల కోట్లు. –ఫలితంగా, అంతకు ముందు పాలన అయిదేళ్ళతో పోలిస్తే మన మూడేళ్ల పాలనలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటున ఏటా 16 లక్షల టన్నులు పెరిగింది!72 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత, మూడేళ్ల క్రితం... ఒక శాచురేషన్ పద్ధతిలో పేదలకు ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని మన ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తే... ఏకంగా 31 లక్షల ఇల్లు కుటుంబాలకు... అంటే దాదాపు 1.25 కోట్ల జనాభాకు... ఈ 31 లక్షల మంది అక్కచెల్లెమ్మల చేతుల్లో అక్షరాలా దాదాపుగా రూ. 2 లక్షల కోట్ల నుంచి – రూ.3 లక్షల కోట్ల సంపదను ఉంచుతున్నాం.పేదల తలరాతలు మార్చాలనే లక్ష్యంతో..పిల్లల చదువులతోనే ఇంటింటా పేదల తల రాతలు మార్చాలని, వారి ఇంట వెలుగులు నింపాలనే మంచి సంకల్పంతో... రూపం మార్చుకున్న అంటరాని తనాన్ని తుద ముట్టించాలన్న నిశ్చయంతో... ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాలు ఎప్పటికీ పనివాళ్ళుగా మిగిలిపోవాలనే పెత్తందారీ పోకడల నడ్డి విరుస్తూ... గవర్నమెంటు బడులన్నింటిలో ఇంగ్లీష్ మీడియంను అమలు చేయాలని నిర్ణయించాం.

# స్వాతంత్ర్య పోరాటం మహోన్నతం..

## ప్రపంచంతో పోటీపడి ప్రగతి సాధన: ఏపీ సీఎం జగన్





విజయవాడ: స్వాతంత్ర దినోత్సవ సంబురాలు దేశం మొత్తం అట్టహాసంగా సాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏపీ ప్రభుత్వం నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా.. సోమవారం ఉదయం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో జాతీయ జెండా ఆవిష్కరించారు సీఎం జగన్. అనంతరం ఆయన సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం శకటాల ప్రదర్శనను వీక్షించి.. ప్రసంగించారు.స్వాతంత్ర పోరాటానికి నిలువెత్తు రూపం జాతీయ జెండా. పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండా.. భారతీయుల గుండె అని సీఎం జగన్ పేర్కొన్నారు. జాతీయ జెండా మన స్వాతంత్రానికి, అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రతీక. సార్వభౌమత్వానికి, ఏకత్వానికి, దేశభక్తికి, మన ఆత్మగౌరవానికి ప్రతీక. వాదాలు వేరైనా దేశ స్వాతంత్రం గమ్యంగా పోరాడారు ఆనాటి యోధులు. వాళ్లను స్మరించుకుంటూ.. హ్యాట్సాఫ్ చెప్పాల్సిన అవసరం ఉంది. అహింసే ఆయుధంగా, సత్యయే సాధనంగా సాగిన శాంతియుత పోరాటం.. ప్రపంచ మానవాళికి మోహోన్నత చరిత్రగా నిలిచే ఉంటుంది. 75 ఏళ్లలో దేశం తిరుగులేని విజయాలు సాధించిందని, ప్రపంచంతో పోటీ పడి మరీ ప్రగతి సాధిస్తోందని కొనియాడారు సీఎం జగన్. రైతన్నలకు సెల్యూట్. ఆహారం, ఔషధాలు, ఆఖరికి స్మార్ట్ ఫోన్ల రంగంలోనూ దేశం టాప్ లిస్ట్‌లో కొనసాగుతోందని గుర్తుచేశారు సీఎం జగన్. ఇక ఏపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై సీఎం జగన్ మాట్లాడారు.

## ఎందరో యోధుల త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం

### జెండా ఆవిష్కరించిన పవన్ కళ్యాణ్

అమరావతి,ఆగస్టు15 : ఎందరో యోధుల త్యాగాల ఫలితమే ఇవాళ మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. కులమతాలకు అతీతంగగా మనమంతా కలసి ముందుకు సాగాల్సి ఉందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమం స్ఫూర్తితో జనసేన స్థాపించబడిందన్నారు. ఎవరినైనా కలపడం కష్టం.. విడదీయడం సులభమన్నారు. కుల, మత ప్రస్తావన లేని రాజకీయాలు దేశానికి కావాలన్నారు. ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం కావాలి.. దాన్ని విస్మరిస్తే విచ్చిన్నమేనన్నారు. వైజాగ్‌లో పరిశ్రమల కాలుష్యం కానీ.. ఆక్వా వల్ల నీరు, భూమి కాలుష్యం అయిపోయింది.. వీటిని కాపాడటమే జనసేన బాధ్యతన్నారు. ఒక మసీదు, ఒక చర్చికి అపవిత్రం జరిగితే మనం బలంగా ఏ విధంగా ఖండిస్తామో.. దేవాలయాలకు అలాంటి పరిస్థితి వస్తే అంతే బలంగా ఖండిస్తామని.. అదే సెక్యులరిజమన్నారు. కేవలం ఓట్లు కోసం మత రాజకీయాలు చేయడం సరైంది కాదన్నారు. ఓట్లు వస్తయో లేదో తెలియదు కానీ వాస్తవాలు మాత్రమే తాను మాట్లాడతానన్నారు. మతాల ప్రస్తావనలేని రాజకీయం జనసేన లక్ష్యమని, రామతీర్థం ఘటనలో ఖండిచాం తప్ప.. రెచ్చ గొట్టలేదన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం మత ప్రస్తావన తీసుకొచ్చే వారిని, తప్పులు చేసే వారిని జన సైనికులు, నేతలు ముక్త కంఠంతో ఖండించాలని సూచించారు.

# పరాయి పాలనలో దోపిడీకి గురైన దేశం

### రాబోయే 25 ఏళ్లకు ప్రణాళికలు వేసుకుని సాగాలి
### విలువలతో కూడా సమాజ నిర్మాణం సాగాలి
### జెండా ఎగురేసి అభినందనలు తెలిపిన చంద్రబాబు



గుంటూరు,ఆగస్టు15(): పరదేశి పాలనలో దేశం దోపిడీకి గురైందని, ప్రజలు బానిసత్వంలో మగ్గారని, విదేశీ పాలనలో పేదరికం, కరవు కాటకాలు అనుభవించారని టీడీపి జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాబోయే 25 ఏళ్లలో ఏం చేయాలో ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని చంద్రబాబు సూచించారు. విలువలతో కూడిన సమాజం ఏర్పాటుకు కృషి చేయాలని, లేకపోతే సమాజం విచ్ఛిన్నం అవుతుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం గుంటూరు జిల్లా, చేబ్రోలులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ సభ జరిగింది. జెండా ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు చాలామంది తమ ప్రాణాలను, ఆస్తులను త్యాగం చేశారని.. వారి త్యాగాలను గుర్తుచేసుకుంటూ ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు ఘనంగా జరుపుతున్నామని.. దేశ సేవకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన సమయమిదని చంద్రబాబు అన్నారు. పేదరికం నుంచి.. నేడు ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి భారత్ ఎదిగిందని చంద్రబాబు చెప్పారు. రక్షణ రంగంలో ఎంతో పురోభివృద్ధి సాధించామని, సొంతగా ఆయుధాలు తయారు చేసుకునే స్థాయికి చేరామని అన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని, క్రమశిక్షణను అందరిలో పెంచాలని, ప్రతి ఒక్కరిలోనూ దేశ భక్తి రగిల్చేలా పనిచేయాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. విలువలతో కూడిన సమాజం ఏర్పాటుకు కృషిచేయాలని, ఆర్థిక అసమానతలు తొలగించే వ్యవస్థకు శ్రీకారం చుట్టాలని సూచించారు. నాడు విదేశీ పాలనలో పేదరికం, కరవు కాటకాలు అనుభవించామన్న బాబు.. ఇప్పుడు దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

# నిలిచి గెలిచిన భారత్: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: స్వతంత్రం వచ్చినప్పుడు భారత్ నిలబడలేదని, ముక్కలు చెక్కలవుతుందని చాలామంది అన్నారని ప్రధానిమోదీ చెప్పారు. కానీ అనుమానాలను పటాపంచలు చేసస్తూ భారత్ నిలిచి గెలిచిందన్నారు. ప్రపంచ యవనికపై తనదైన ముద్రవేసిందని, సమస్యలకు ఎదురొడ్డి నిలిచిందన్నారు. ఆకలికేకల భారతావని నేడు ఆహార ధాన్యాల ఎగుమతి స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. వైజ్ఞానిక రంగంలో ఇండియా తన ముద్ర వేస్తున్నదని చెప్పారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచానికి ఆదర్శంగా నిలబడిందని చెప్పారు. ప్రజాస్వామ్య దేశాలకు భారత్ మార్గదర్శిగా నిలిచిందని స్పష్టం చేశారు. మహాత్మునికి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. దేశప్రగతిని పరుగులు పెట్టించేందుకు ప్రతి పౌరుడు సిద్ధంగా ఉన్నాడని చెప్పారు. కేంద్రం, రాష్ట్రం ప్రజల ఆశలు సాకారమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతిక్షణం కలిసి పనిచేయాల్సిన సమయంలో ఆసన్నమైందన్నారు. మన ముందున్న బంగారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ప్రజానీకం నవచేతనతో ముందడుగు వేస్తున్నది. వచ్చే 25 ఏండ్లు పంచ ప్రాణాలుగా భావించి అభివృద్ధి కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. స్వతంత్ర సమరయోధుల ఆకాంక్షలను సాకారం చేయాలన్నారు. సంపూర్ణ అభివృద్ధి మనముందున్న అతిపెద్ద సవాలని చెప్పారు. మనలో ఏ మూలన దాగివున్న బానిస మనస్తత్వాన్ని వదిలేయాని సూచించారు. సర్వ స్వతంత్ర ప్రజాస్వామ్యంగా మనం నిలబడాలని ప్రధాని వెల్లడించారు.రాజకీయ సుస్థిరత వల్ల ప్రయోజనాలను ప్రపంచానికి భారత్ చూపిందని తెలిపారు. రాజకీయ సుస్థిరత వల్ల అభివృద్ధిలో వేగం, నిర్ణయాధికారంలో దేశం శక్తిమంతమవుతుందని చెప్పారు. రాజకీయ సుస్థిరత దేశ గౌరవ మర్యాదలను పెంచుతుందని ప్రధాని మోదీ అన్నారు.

# మరో 48 గంటలు ఏపీలో భారీ వర్షాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత రెండు రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. మరో 48 గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. విశాఖపట్నంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఉత్తర కోస్తా ఆంధ్ర, రాజమండ్రి, ఏలూరులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ పేర్కొన్నది.కాగా, ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరు పాడు ఇంకా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఈ రెండు గ్రామాల ప్రజలు గత రెండు వారాలుగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. భారీ వర్షాల కారణంగా కృష్ణా నది కింద ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పొంగిపొర్లుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టుకు భారీ వరద కొనసాగుతుండడంతో ప్రాజెక్టు పది గేట్లను ఎత్తివేశారు.భారీ వర్షాలతో కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. శ్రీశైలం ప్రాజెక్ట్‌కు భారీ వరద కొనసాగుతున్నది. కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నది. ఎగువన కురుస్తున్న వానలతో ప్రకాశం బరాజ్ దగ్గర వరద పెరిగింది.



# సంపాదకీయం

మంగళవారం 16-08-2022

## భవిష్యత్ అంతా భారత్‌దే..!

ప్రపంచం అంతా నిద్రిస్తున్న వేళ .. అర్థరాత్రి భారత్ కొత్త జీవితం, స్వేచ్ఛల కోసం మేలుకుంది..! " అని 75 ఏళ్ల క్రితం భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన క్షణాన జవహర్‌లాల్ నెహ్రూ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆ మాటల వెనుక ఎంతో అర్థం ఉంది. స్వాతంత్రం వస్తేనే సమస్యలు పరిష్కారం కావు. అప్పట్నుంచే అసలు సమరం ప్రారంభమవుతుంది. దేశానికి ప్రజలందరూ కలిసి ఓ దశ.. దిశ తీసుకు రావాల్సిన అవసరం అప్పుడు ఉంది. అప్పట్నుంచి ఇప్పటికి 75 ఏళు పూర్తయ్యాయి. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఇన్నేళ్ల కాలంలో భారత్ ఏం సాధించింది..? ప్రపంచంతో పోటీ పడి ఎంత ముందుకెళ్లాం..? రెండు శతాబ్దాల బానిసత్వం.. త్యాగధనుల పోరు ఫలితం.. స్వేచ్ఛా గీతికతో మువ్వన్నెల స్వాతంత్ర్య భారతం. రెండు వందల సంవత్సరాలు భారత్‌ను తమ కబంధ హస్తాల్లో బిగించిన ఆంగ్ల పాలకుల్ని తరిమేయడానికి చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతి పౌరుడూ ఓ యోధుడయ్యాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో సామాన్యుడు సైతం దేశం కోసం సర్వం త్యాగం చేశాడు. జెండా పట్టుకుని భరతమాత దాస్య శృంఖలాలు తెంచేందుకు వజ్రాయుధమే అయ్యాడు. అలా అందరి రక్తం, కష్టం, త్యాగం సమ్మిళితంగా మన చేతికందిన స్వాతంత్ర్యానికి 75వ ఏడు వచ్చింది. ఏమి సాధించామన్న విషయాన్ని ఆత్మపరిశీలన చేసుకోవడానికి.. సాధించాల్సిందేమిటని నిర్దేశించుకోవడానికి ఇది అరుదైన అవకాశం. 75 ఏళ్ల కిందటి ప్రజల జీవన ప్రమాణాలతో పోలిస్తే ఇప్పుడు దేశం ఎంతో పురోగమించింది. మన పూర్వికుల వరకూ ఎందుకు... ఈ నాటి యువత తల్లిదండ్రుల్ని అడిగితేనే తాము ఎలాంటి మౌలిక వసతులు లేని పరిస్థితుల్లో పెరిగామో చెబుతారు. ఓ పాతికేళ్ల ఏళ్ల క్రితం వరకూ సగం జనాభాకు కరెంట్ అంటే తెలియదు. ఇంటర్నెట్ అనే పదం కూడా తెలియదు. ఇక రోడ్లు , మంచినీరు , గ్యాస్ వంటి సౌకర్యాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అలాంటి పరిస్థితుల్ని ... ప్రస్తుత పరిస్థితుల్ని పోల్చి చూసుకుంటే దేశం ఎంతో పురోగమించిందని అర్థం చేసుకోవచ్చు. దేశంలో కరెంట్ అందని గ్రామం లేదని ఇటీవలే కేంద్రం ప్రకటించింది. చిట్ట చివరి గ్రామానికీ విద్యుత్ వెలుగులు అందించామని తెలిపింది. ఇక విద్య, వైద్య సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయి. అందరికీ సరిపడా అందుతున్నాయా అంటే.. సంతృప్తికరం అని చెప్పలేం కానీ.., నిన్నటి కంటే ఈ రోజు మెరుగు అని మాత్రం చెప్పగలిగే స్థితిలో భారత్ ముందడుగు వేసిందని చెప్పుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన 75ఏళ్లకు కూడా భారత్‌ను అభివృద్ధి చెందుతున్న దేశంగానే చెబుతున్నారు. దేశ జనాభాలో ఇప్పటికీ సగం మందికిపైగా పేదరికంలోనే ఉన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పేరొందిన భారత్‌లో ఇంతమంది పేదలు ఉండటం ఖచ్చితంగా వైఫల్యమే. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. కానీ పేదలు మాత్రం పైకి రావడం లేదు. పేదరికం తగ్గిపోయిందని ప్రభుత్వం లెక్కలు చెబుతూ ఉండవచ్చు. కానీ ప్రభుత్వం నిర్దేశించుకున్న మొత్తం కన్నా ఒక్క పైసా సంపాదించుకున్నా వాళ్లు పేదలు కాదనడం... మనల్ని మనం మోసం చేసుకోవడమే. దేశంలో విద్య, వైద్యం అందని వారంతా పేదలుగానే భావించాల్సి ఉంటుంది. ఇటీవలి కరోనా మహమ్మారి సమయంలో ఆ వైరస్ బారిన పడి ఎంత మంది .ఎన్ని లక్షల కుటుంబాలు అప్పులపాలయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ధనిక.. పేద తేడా లేదు. అందరూ ఆస్తులు కోల్పోయారు. అప్పుల పాలయ్యారు. కేవలం రేషన్ కార్డు ఉన్న వారే పేదవాళ్లు.. మిగతా వాళ్లెవరూ కాదనడం ఎంత మూర్ఖత్వమో.. ప్రభుత్వాలు కూడా అర్థం చేసుకున్న రోజునే నిజమైన పేదరిక నిర్మూలనకు బీజాలు పడతాయి. ఈ 74 ఏళ్ల భారతావనిలో ప్రభుత్వాలు అంత విశాలంగా ఆలోచించకపోవడమే ఇప్పటి వరకూ చోటు చేసుకున్న విషాదం. శతాబ్దానికి మూడు వంతులు గడిచిపోయింది. టెక్నికల్‌గా మనం ఎక్కడకో పోయాం. చంద్రుడ్ని అదుకుంటున్నాం. ఆకాశానికి నిచ్చెనలేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు వైద్య రంగంలో సంచలనాలు సృష్టిస్తున్నారు. టెక్నాలజీ రంగంలో భారతీయులే గ్రేట్ అన్న పేరు తెచ్చుకుంటున్నారు. కానీ.. అదే సమయంలో కాస్త వెనక్కి తిరిగి చూస్తే .. మన నలుపు మనకే అసహ్యమేస్తూ ఉంటుంది. దేశ సమగ్రతను కాపాడుకోవాలన్నా, అభివృద్ధిలో ముందుకు సాగిపోవాలన్నా అది ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుంది. కానీ ప్రజలు వదిలించుకోలేని సమస్య కులం, మతం . దేశం తరపున ఎవరైనా ఓ గొప్ప విజయం సాధిస్తే ముందుగా అతని కులం ఏమిటి అని వెదికే వారి సంఖ్య ఇండియాలో ఎక్కువ. ఓ మతం వారు విజయం సాధిస్తే ఆ మతం కనుక ప్రశంసించేవారూ తగ్గిపోతారు. దీనికి సాక్ష్యం హాకీ క్రీడాకారిణి వందన కటారియా ఉదంతం. ఆమె ఒలింపిక్స్‌లో సర్వశక్తులు ఒడ్డి దేశానికిప తకం తెచ్చేందుకు ప్రయత్నిస్తూంటే... ఇండియాలో ఆమెఇంటిపై కులపరమైన దాడిజరిగింది. దీనికి స్వతంత్ర భారతావని మొత్తం సిగ్గుపడాల్సిందే. ఇక్కడ తప్పు.. వందనా కటారియా కుటుబంపై కులపరమైన దాడి చేసిన వారిది కాదు.. అలాంటి మనస్థత్వాన్ని వదిలించుకోలేకపోయిన భారతీయులది. ఆ విషయంలో 75 ఏళ్లలో మనం సాధించింది చాలా స్వల్పం. ఇంకా విశాలం చేసుకోవాల్సిన అభిప్రాయాలు అనంతం ఉన్నాయి. కానీ రాను రాను దేశంలో కులాల పరిస్థితి దుర్భరంగా మారుతోంది. సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్న వర్గాలు సైతం తమకూ రిజర్వేషన్లు కావాలని డిమాండు చేస్తున్న పరిస్థితి నెలకొంది. అదృష్టవశాత్తూ ఈ విషయంలో భారత్‌కు అన్నీ మంచి సూచనలే ఉన్నాయి.. ఈ 75వ స్వాతంత్ర్య వేడుకల్ని... తిరంగా రెపరెపలతో.. ఘనమైన వారసత్వ సంపదతో.. మొక్కవోని భవిష్యత్ సంకల్పంతో భారతావని మున్ముందుకు దూసుకుపోయేలా ఉంటుందని ఆశిద్దాం..

## అలరించిన శకటాల ప్రదర్శన



ఏలూరు, (ఆగష్టు15 ) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో సోమవారం వివిధ ప్రభుత్వ శాఖలు ప్రదర్శించిన శకటాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నాయి. గృహ నిర్మాణ సంస్థ, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామ సచివాలయాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, 108, 104, అగ్నిమాపక శాఖ, పౌర సరఫరాలు, తదితర శాఖలు చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన శకటాలు ప్రజలను ఆసక్తిగా తిలకించారు. శకటాల ప్రదర్శనలో నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా పేదలందరికీ ఇల్లు పథకం కింద పేదలకు నిర్మిస్తున్న గృహాలు, మౌలిక సదుపాయాలపై రూపొందించిన గృహ నిర్మాణ శాఖకు చెందిన శకటానికి మొదటి బహుమతి, అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, మనబడి-నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాలపై రూపొందించిన విద్యా శాఖ శకటానికి రెండవ బహుమతి, పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలందించే దిశగా నాడు-నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ ఆసుపత్రులలో చేపట్టిన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుపై రూపొందించిన వైద్య ఆరోగ్య శాఖ శకటానికి మూడవ బహుమతి లభించింది. ఆయా శాఖల అధికారులకు సర్టిఫికెట్, మెమెంటోలను రాష్ట్ర రవాణా శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు పినిపే విశ్వరూప్ అందించారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్, జిల్లా జడ్జి సి. పురుషోత్తమరావు, టిడీఎం కోర్ట్ జడ్జి దివాకర్, ఎక్సయిజ్ కోర్ట్ మేజిస్ట్రేట్ సి. రమణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి ,జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్, డి.ఐ.జి పాల రాజు, ఎస్.పి రాహుల్ దేవ్ శర్మ, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాం, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బి.వి. కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీచ్ ను శుభ్రంగా వుంచుకుందాం



విశాఖపట్నం విశాఖ బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించా లని జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున పిలుపు నిచ్చారు.జిల్లా కలెక్టర్ సూచన మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ ల కార్యకర్తలు, విద్యార్థు లు బీచ్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్య క్రమాన్ని విజయ వంతంగా నిర్వహిస్తు న్నట్లుగా తెలిపారు.సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిర్మూలిం చడమే మన లక్ష్యమని పేర్కొన్నారు. పెద్ద జాలరి పేట బీచ్ పరిసర ప్రాంతాల లో శాశ్వతంగా ఉండేలా డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని జివిఎంసి అధికారులు ఆదేశించారు.ప్రతిరోజు కొన్ని వేలమంది టూరిస్టులు విశాఖ లోని వివిధ బీచ్ ప్రాంతాల్లో సందర్శి స్తుంటూ రని, వీరికి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగాహ న కల్పించాలన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

### -ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం.




నెల్లూరు .ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించుట గురించి14న నెల్లూరు నగరంలోని ఇండియన్ ఐఎంఏ హాల్ నందు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ విభాగాల నాయుకులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పి ఆర్ టి యు నుంచి అధ్యక్షులు డి. వెంకటరాజు, ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న అనేక కక్ష సాధింపు చర్యలు గురించి చర్చించారు. ఇందులో భాగంగానే చట్టానికి వ్యతిరేకంగ ఉద్యోగుల పిఎఫ్ నగదు వాడుకోవటం. దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా పిఆర్సి ఐ ఆర్ (27%) కంటే తక్కువ (23%) ఫిట్మెంట్ ఇవ్వడం. సిపిఎస్ రద్దు చేయకపోవటం.సకాలంలో నెలవారీ జీతాలు ఇవ్వకపోవడం.అత్యంత దుర్మార్గంగా పి ఆర్ సి బకాయిలు పదవి విరమణ అనంతరం ఇస్తామనటం.విద్యాశాఖలో ఊహకి అందని గందరగోళానికి శ్రీకారం చుట్టడం.ప్రశ్నిస్తే కేసులు పెట్టటం తదితర విషయాల పట్ల ప్రభుత్వం దిగిరాకపోతే రాబోయే కాలంలో ఊహకి అందని నష్టాన్ని చవిచూడక తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.లేని పక్షంలో రాబోయే కాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు వచ్చేవరకు మీతో అంటే ప్రభుత్వంతో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలా వద్దా అనేది త్వరలో నిర్ణయించుకుంటామని ముందస్తుగా ప్రభుత్వానికి తెలియజేశారు .

## జిల్లా పరిషత్ కార్యాలయము స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



ఏలూరు, (ఆగస్టు 15) జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము , పశ్చిమ గోదావరి , ఏలూరు నందు 76 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు . జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ సోమవారం స్థానిక జడ్పి కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భారత దేశమునకు స్వాతంత్ర్యము సంపాదించిపెట్టిన నాయకులకు ఘన నివాళి అర్పించి వారి సేవలను కొనియాడారు . దేశ నాయకుల స్ఫూర్తి తో ఉద్యోగులు మరియు ప్రజలు పనిచేసి భారత దేశాన్ని అన్నీ రంగాలలో ముందుకు తీసుకెళ్ళాలని వారి కోరారు . ఈ కార్యక్రమములో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కె.వి.ఎస్.ఆర్.రవి కుమార్ మరియు జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు , సిబ్బంది పాల్గొన్నారు.

## లింగాల మండలం మహిళా శక్తి భవన్ నందు 76 వ భారత స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



### గనివికా చిన్నారి చేతులమీదుగా జాతీయ జెండా వందనం
### డి ఆర్ డి ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు

కడప ఆగస్టు 15: కడపజిల్లా లింగాల మండలము లో డి ఆర్ డి ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆఆంజనేయులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమము విజయవంతం చేయడం లో ప్రతి భారతీయుని కృషి శ్లాఘనీయం అన్నారు. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎంతో మంది అసువులు బాపారని వారి త్యాగ ఫలితమే నేటి స్వేచ్ఛావాయువులని గుర్తు చేశారు. 1947 ఆగస్టు 14 వ తారీకు అర్ధ రాత్రి బ్రిటిష్ వారు భారతదేశానికి స్వతంత్రం దేశంగా అప్పగించాలని నిర్ణయం ఎంతోమంది భారతీయుల స్వేచ్ఛా స్వాతంత్రం నిరీక్షణకు తెర పడినట్లయింది. భారతదేశ విభజన అప్పటి దేశ రాజకీయ నాయకుల మధ్య అయిష్టంగానే జరిగినప్పటికీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని భారత దేశం అభివృద్ధి వైపు నడుస్తోందని తెలిపారు.దేశ రక్షణలో ఆర్మీ, దేశ పోషణలో రైతులు ఎనలేని కృషిచేస్తున్నారని తెలిపారు. భారత దేశ స్వాతంత్రం ఫలాలు ప్రజలందరికీ జీవించే స్వేచ్ఛ సమాన న్యాయం సమాన అవకాశాలు కల్పించడంలో అప్పటి దేశ నాయకులు ఎంతో చొరవ చూపారని గుర్తు చేశారు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింస శాంతియుత మార్గాల ద్వారా.గడ గడ లాడించి ఓడించి స్వాతంత్రం పొందడం ప్రపంచ దేశాలలో తరువాత జరిగిన ఎన్నో దేశాల స్వాతంత్ర ఉద్యమాలు కి భారత దేశ స్వాతంత్ర ఉద్యమం దోహదపడిందని తెలియజేశారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఉత్తయ్య మాట్లాడుతూ భారత దేశానికి జాతీయ జెండాను రూపకల్పన చేసిన శ్రీ పింగళి వెంకయ్య గారు చిరస్మరణీయులని ఆంధ్రుడు అని గర్వించదగ్గ విషయమని తెలిపారు తదనంతరం గ్రామ సమాఖ్య అసిస్టెంట్ రాగమని జాతీయ గేయాలను భక్తి గేయాలు ఆలపించారు. ఆజాద్ కా అమృత మహోత్సవ కార్యక్రమంలో పలు గ్రామాలలో చురుకుగా పాల్గొన్న గ్రామ సమాఖ్య అసిస్టెంట్లను మరియు గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు లను ప్రత్యేక ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కో ఆర్డినేటర్ లు జయపాల్ సూర్యనారాయణ గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు జయశ్రీ హేమలత అరుణ దేవి రాగమని రాదమని పద్మావతి నాగ ముని కుమారి గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు గంగా దేవి రాధా శ్రీకాంత్ ముని డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల త్యాగాలే స్వాతంత్ర్యానికి పునాది

కడప ఆగస్టు 15:;కడప. లో అమరవీరుల త్యాగాలే దేశ స్వాతంత్ర్యానికి పునాదులని లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. చిన్నపరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి, కడప హోటలర్స్ అసోసియేషన్ ఉమ్మడి ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత ర్యాలీని నిర్వహించారు.ఆగష్టు 15న ఆజాది కా అమృత్ మహోత్సవ్‌ను పురస్కరించుకొని పై సంస్థలు నగరంలోని కోటిరెడ్డి విగ్రహానికి పూలమాల అలంకరించినివాళిఅర్పించారు. అనంతరం మువ్వన్నెల జండాలతో ర్యాలీగా బయలుదేరారు. దేశభక్తులు, భరతమాత పేర్లతో నినాదాలు చేస్తూ దారి వెంబడిపేదలు,పిల్లలకుమిఠాయిలుపంపిణీచేశారు. స్వాతంత్ర్యసమరయోధులు పి. బసిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఆయనకు కూడా నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీ యర్రముక్కపల్లెలోని అమరసైనికుల స్మారక సర్కిల్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. ఆర్. రంగనాథరెడ్డి, కార్యదర్శి వి. గౌరిశంకర్, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, ఓంశాంతి పవన్, హోటలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, లయన్ రషీద్, లయన్ పి. మన్సూర్, లయన్ ముఖేష్, లయన్ పద్మప్రియ చంద్రారెడ్డి, లయన్ కొండూరు జనార్దన రాజు తదితరులు స్వాతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన జిల్లా త్యాగధనులకు ఘనంగా నివాళులర్పించి జాతీయ జండాను ప్రతిష్ఠించి వందనాలు అర్పించారు.



## నూతన జిల్లాలో అంబరాన్నంటిన తొలి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



భీమవరం: ఆగస్టు 15 : ఆంధ్రరేఖ ప్రతినిధి:పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా జిల్లాలో నిర్వహించుకున్న పంద్రాగస్టు వేడుకలు జిల్లా ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. దేశం అంతటా అజాదికా అమృత్ మహోత్సవం వేడుకలు నిర్వహించుకుంటున్న వేళ భీమవరంలో నిర్వహించుకున్న వేడుకలు మరింత ప్రత్యేకతను సంతరించుకున్నాయి.రాష్ట్ర రోడ్లు, భవనముల శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి దాడిశెట్టి రామలింగేశ్వర రావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజలకు తన సందేశాన్ని అందజేశారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆర్థిక స్థితి కల్పించే దిశగా నవరత్నాల పథకాలను కుల, మత, ప్రాంత రాజకీయాలకు అతీతంగా అందజేస్తున్నామన్నారు. జగనన్న అమ్మఒడి ద్వారా జిల్లాలో సుమారు 1.4 లక్షల మంది తల్లులకు 15 వేల రూపాయలు చొప్పున 221 కోట్లు రూపాయలు అందచేయడం జరిగిందన్నారు. మనబడి-నాడు నేడు కార్యక్రమం కింద 727 పాఠశాలను ఎంపికచేసి 262 కోట్ల రూపాయలతో మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సక్రమ అమలుకు జిల్లాలో 515 గ్రామ వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి 4,400 పోస్టులను భర్తీ చేసుకున్నాం అన్నారు. అలాగే 8,660 వాలంటీర్ పోస్టులను కూడా భర్తీ చేసుకున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సామాజిక సమస్యలకు జవాబుదారీ తనంతో పరిష్కరించే దిశలో ప్రతి సోమవారం స్పందన నిర్వహించుకుంటున్నాం అన్నారు. వైయస్సార్ నేతన్న నేస్తం పథకానికి అర్హులైన 779 చేనేత కుటుంబాలకు నెలకు 2000 చొప్పున సంవత్సరానికి 24000 రూపాయలు ప్రోత్సాహంగా అందించడం జరుగుచున్నదన్నారు.

# సొంత పార్టీకి చుక్కలు రఘురామకృష్ణం రాజు



ఏలూరు, ఆగస్టు 15, నర్సాపురం వైసీపీ ఎంపీ రఘురామకృష్ణరాజు ఎప్పటికప్పుడు ట్రెండీగా ఉంటారు. ఎక్కడ ఏ చిన్న ఛాన్స్ దొరికినా, వైసీపీ అధినేతను, ఆ పార్టీ నేతలను తూర్పారపడుతూనే ఉంటారు. తాజాగా హిందూపురం వైసీపీ ఎంపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో కాల్ వ్యవహారం, జరుగుతున్న పరిణామాలు, వైఎస్ విజయమ్మ కారు ప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ తన దైన స్టైల్ లో స్పందించారు.గోరంట్ల మాధవ్ కు మద్దతిచ్చి, 500 కార్లతో ఊరేగింపుగా వైసీపీ నేతలు తీసుకెళ్తారా? అంటూ రఘురామ ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నుంచి మాధవ్ ను స్వాగతించమేంటని నిలదీస్తున్నారు. రాజ్యాంగాన్ని అనుసరించాలని చెప్పిన తనను దేశ ద్రోహిగా చిత్రీకరించి, చిత్రహింసలు పెట్టి, తనను సొంత ఊరికి వెళ్లనివ్వకుండా ఎప్పటికప్పుడు కేసులు పెడుతున్న మా పార్టీ ప్రభుత్వం.. నగ్న వీడియో వివాదంలో చిక్కుకున్న ఎంపీ గోరంట్ల మాధవ్ కు అఖండ స్వాగతం చెప్పేందుకు రెడీ అవడం ఏమిటని నిలదీస్తున్నారు. ఆ అశ్లీల వీడియోలో ఉన్నది గోరంట్ల మాధవ్ కాదని సెంట్రల్ ల్యాబ్ పరీక్షించి నిర్ధారించి చెప్పిన తర్వాత వీరోచితంగా వెళ్తే బాగుంటుందని రఘురామ అభిప్రాయపడ్డారు. గోరంట్ల మాధవ్ నిర్దోషే కావచ్చు.. కానీ ఆయన నిర్దోషి అని రుజువయ్యే వరకు ఆగలేని మీరు నన్ను ఆపేస్తారా? అంటూ రఘురామ విమర్శించారు.మనం చేసే అభివృద్ధితో దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తోందని జగన్ ఎప్పుడూ చెబుతుంటారని రఘురామ గుర్తుచేస్తూ.. అవును.. మాధవ్ అశ్లీల వీడియో వల్ల దేశమంతా మీ వైపే చూస్తోందంటూ జగన్ సెటైర్లు గుప్పించారు. ఇలాంటి వ్యక్తుల్ని ప్రోత్సహిస్తుంటే దేశమంతా మీ వైపు చూడక ఏం చేస్తుంది అని కామెంట్ చేశారు.. గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో కాల్ పై ప్రజల్లో గూడుకట్టుకున్న అనుమానాలను తొలగించేందుకు ప్రతిష్టాత్మక పరిశోధన కేంద్రానికి పంపి నివేదిక తెప్పించాలని రఘురామ కృష్ణరాజు సీఎం జగన్ కు సూచిచారు. మీకు కుదరకపోతే తానే ప్రతిష్టాత్మక ప్రైవేట్ ల్యాబ్ నుంచి నివేదిక తెప్పిస్తానని ఆఫర్ కూడా ఇచ్చారు.రఘురామకృష్ణరాజు తన సతీసమేతంగా శుక్రవారంనాడు రాష్ట్రపతి భవన్ కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. ముర్ముకు శుభాకాంక్షలు చెప్పారు. పనిలో పనిగా తనను వైసీపీ సర్కార్ ఇబ్బందులకు గురిచేసిన వైనాన్ని, పోలీసుల ఓవర్ యాక్షన్ గురించి, గోరంట్ల మాధవ్ వ్యవహారంపైన రాష్ట్రపతికి వివరించినట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.ఏపీ సీఎం జగన్ తల్లి, వైసీపీ మాజీ గౌరవ అధ్యక్షురాలు వైఎస్ విజయమ్మ కారు టైర్లు పంక్చర్ అయిన వైనం పైనా రఘురామ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం సీఎం తల్లికి సంబంధించింది కాబట్టి కారు ప్రమాదంపై జగన్ స్పందించాలని కోరారు. ఆమె ప్రయాణించిన కారు రెండు టైర్లు ఒకేసారి పంక్చర్ అవడం వెనక కుట్ర ఏమైనా ఉందా అన్నది తేల్చాలనేది రఘురామ డిమాండ్ చేశారు.ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ జగన్ మాట్లాడిన వైనాన్ని రఘురామ ప్రస్తావించి, ఇప్పుడు జగన్ హయాంలో ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై 2 వేల కోట్ల అదనపు భారం మోపేందుకు సీఎం సిద్ధం కావడాన్ని తప్పుపట్టారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో కొనసాగించేలా చూడాలని పార్లమెంటులో కోరినందుకు తనపై అనర్హత వేటు వేయాలని చూశారని రఘురామ ఎత్తి పొడిచారు. కొద్ది రోజుల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ప్రధాని మోడీ పాల్గొన్న మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లేందుకు స్థానిక ఎంపీగా రైలులో బయలుదేరిన రఘురామ మార్గ మధ్యలోనే రైలు దిగి వెనక్కి వెళ్లిపోవడం సంచలనం అయింది. తనను చంపేందుకు రైలులో కొందరు అనుసరిస్తున్నారంటూ రఘురామ అప్పుడు చేసిన ఆరోపణలు దుమారం లేపాయి. మొత్తానికి వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు ఎప్పుడు ఏ సందర్భం వచ్చినా ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా జగన్ రెడ్డి సర్కార్ పై విరుచుకుపడేందుకు, విమర్శలు గుప్పించేందుకు రెడీగా ఉంటున్నారు. తద్వారా నిత్యం ట్రెండింగ్ లో ఉంటున్నారు.

# నల్లగా మారిన సముద్రం

విశాఖపట్టణం, ఆగస్టు 15, శాఖ సాగరతీరాన్ని తలచుకుంటేనే మనసంతా తెల్లటి తెరచాపపై పరుచుకుంటుంది. నీలి నీలి ఆకాశం, నేలపైన బంగారువన్నె ఇసుక తిన్నెలు మది మదినీ పలకరిస్తాయి. ప్రతి హృదినీ పులకరిస్తాయి. ఇక వర్షాకాలం విశాఖ తీరంలో అందాలు చూడతరమా? అన్నట్టుంటాయి. అక్కడ వీచే చల్లటి గాలుల్లో ఏదో మహత్యం ఉంటుంది. అయితే ప్రశాంతతకు అద్దంపట్టే విశాఖ తీరం ఇప్పుడెందుకో నల్లబడింది. విశాఖ వాసుల మనసు బెంగపడింది. అసలెందుకిలా తెల్ల బంగారం నల్లబో యింది?. ఉన్నట్టుండి విశాఖ తీరంలోని తెల్లని ఇసుకతిన్నెలు నల్లగా మారిపోయాయి.సముద్రంలో నుంచి బొగ్గు పొడి గుట్టలుగా కొట్టుకొచ్చిందా అన్నట్టు ఆర్కేబీచ్ లోని ఇసుక నల్లటి కాటుకలా మారిపోయింది. దీంతో జనం హడలిపోతున్నారు. ఈ రోజు పౌర్ణమి.అందునా రక్షా బంధన్ పండుగ. ఉదయం విశాఖ ఆర్కే బీచ్ కు వచ్చిన వాకర్స్ రంగు మారిన ఇసుకను చాసి ఆశ్చర్యపో యారు. నిన్నటివరకు మామూలుగా ఉన్న ఇసుక తెల్లారేసరికి రంగు మారటంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. భయంతో ప్రజలు అటువైపు వెళ్లడమే మానేసిన పరిస్థితి ఏర్పడింది.ఎప్పుడూ తీరంలో సందడిచేసే జనం ఇప్పుడు అటు తొంగి చూడ్డానికే భయపడుతు న్నారు. అసలేం జరిగిందో, ఏదైనా ప్రమాదం పొంచివుందేమోనని హడలిపోతున్నారు. అయితే భయపడాల్సిన పనేం లేదంటున్నారు శాస్త్రవేత్తలు. సముద్రంలోని మురుగు అప్పుడప్పుడు ఒడ్డుకి కొట్టుకురావడం సర్వసాధారణమేనని, అలా వచ్చినప్పుడు ఇసుక నల్లబడుతుందని అంటున్నారు శాస్త్రవేత్తలు. అలాగే ఇనుప రజ ఎక్కువ శాతం సముద్రంలోకి వచ్చినప్పుడు కూడా ఇలా తీరం నల్లటి బొగ్గులా మారిపోతుందంటున్నారు. అయితే దీన్ని ధృవీకరిం చుకోవాలని చెపుతున్నారు. సాధారణంగా క్రియాశీల అగ్నిపర్వతం సమీపంలో ఉన్న బీచ్‌లలో ఈ తరహా నల్లటి ఇసుక కనిపిస్తుందం టున్నారు పరిశోధకులు. లావా, బసాల్ట్‌రాక్స్, ఇతర నల్ల రంగు రాళ్ళు, ఖనిజాలతో కూడిన రాళ్ళు కోతకు గురై ఇసుక నల్లగా మారుతుందంటున్నారు నిపుణులు.ప్రపంచ వ్యాప్తంగా నల్ల ఇసుకతో ఉన్న బీచ్ లకు ప్రసిద్ధి హవాయ్, కేనరీ దీవులు. భారత్ లో సైతం నల్ల ఇసుక బీచ్ లున్నాయి. త్రివేండ్రంలోని కోవలం బీచ్, కర్నాటక లోని తిలమతి బీచ్, మహారాష్ట్రలోని నవపూర్ బీచ్, గుజరాత్ లోని దుమస్ బీచ్ లలో ఇలా ఇసుక నల్లగా ఉంటుంది. అయితే మన విశాఖఇంకా పరిశోధకులు ధృవీకరించాల్సి ఉంది.

# 11 నెలలగా రైతు భరోసా కేంద్రాలకు బకాయిలు




విజయవాడ, ఆగస్టు 14, గ్రామాల్లో ప్రైవేటు భవనాల్లో నడిపిస్తున్న రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)కు ప్రభుత్వం నెలల పర్యంతం అద్దెలు బకాయి పడింది. పదకొండు మాసాలుగా భవన యజమానులకు అద్దెలు చెల్లించట్లేదు. నిధుల సమస్య మూలంగా అద్దె చెల్లింపులు నిలిచిపోయాయని వ్యవసాయశాఖ చెబుతోంది. సకాలంలో అద్దెలు చెల్లించనందున బిల్డింగ్ ఓనర్ల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోందని, కొన్ని చోట్ల ఖాళీ చేయమంటున్నారని, ఎలాగోలా నెట్టుకొస్తున్నామని క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. 'ఆర్‌బికెలు ముఖ్యమంత్రి జగన్ మానస పుత్రికలు' అన్న కొటేషన్ ప్రచారంలో ఉంది. విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు సమస్త సేవలూ గ్రామాల్లోనే అందించే ఉద్దేశంతో ఆర్‌బికెలను 2020 మేలో ప్రభుత్వం నెలకొల్పింది. అర్బన్, రూరల్ కలుపుకొని రాష్ట్రంలో 10,778 ఆర్‌బికెలను ఏర్పాటు చేశారు. ఆర్‌బికెలకు సొంత భవనాలు నిర్మించతలపెట్టగా దశల వారీగా ఇప్పటి వరకు పూర్తయినవి రెండు వేల లోపే. వేలల్లో ఇంకా నిర్మాణదశలోనే ఉ న్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఆర్‌బికెలకు సొంత భవనాలు నిర్మిస్తున్నారు .ప్రస్తుతం ఎపి వ్యాప్తంగా 4,800 పైచిలుకు ఆర్‌బికెలు ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి. ఉన్న ఆర్‌బికెలలో 45 శాతం అద్దె బిల్డింగ్‌లే. ఒక్కో మండలంలో నాలుగైదే సొంత భవనాలని, మిగతా వి అద్దెవని, పదకొండు నెలలుగా అద్దె చెల్లించట్లేదని చెబుతున్నా రు. ఒక్కో జిల్లాకు ఎంత లేదన్నా రూ.50?60 లక్షల అద్దె బకాయి ఉన్నాయని, రాష్ట్రం మొత్తంమ్మీద రూ.12?15 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని తెలుస్తోంది. రైతులకు సేవలందించే కేంద్రాలకు అద్దెలు పెండింగ్ పెట్టడం ఇబ్బందికరమని క్షేత్ర స్థాయి సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. తీయగా బిల్లులు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. అతి త్వరలోనే చెల్లిస్తామన్నారు.రెండేళ్ల కింద ఆర్‌బికెల ప్రారంభ సమయంలో బిల్డింగ్‌లకు రంగులు వేయించారు. పై నుంచి వచ్చిన ఒత్తిడితో మండల, సబ్?డివిజన్ స్థాయి అధికారులు తమ జేబుల్లో నుంచి రంగులకు ఖర్చు చేశారు. దొరికిన చోట దాతలను ఆశ్రయించారు. కరోనా తొలి దశ విజృంభించే వేళ అధిక వ్యయ ప్రయాసలకోర్చి రంగులు వేయించగా, ఇప్పటి వరకు ఆ బిల్లులు రాలేదని అధికారులు వాపోతున్నారు.

# జాతీయ జెండా స్తూపం నిర్మాణంపై వివాదం

ఆచంట పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం మార్టేరు లో జాతీయ జెండా స్తూపం నిర్మాణ విషయమై వివాదం నెలకొ ల్పింది.జాతీయ జెండా స్తూపం నిర్మాణము కొరకు స్థానిక అధికా రులకు సమాచారం ఇచ్చి నిర్మాణం చేపట్టి పనులు జరుగుతుం డగా మధ్యలో రెవెన్యు సిబ్బంది స్తూపం నిర్మాణము జరుగుతున్న స్థలానికి చేరుకుని స్తూపం నిర్మాణ పనులు చేయవద్దు అంటు పోలీస్ సిబ్బంది అధ్వర్యంలో పనులను నిలిపివేయడం జరిగింది. ఇది కేవలం కక్షపూరితంగా జరుగుతున్నటువంటి కుట్ర మేమం దరం ప్రధానమంత్రి మోడీ పిలుపుమేరకు మంచి సంకల్పంతో కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా జాతీయ జెండా స్తూపం ఏర్పాట్లు చేస్తుంటే సగం మధ్యలో ఎందుకు నిలిపి వేస్తున్నా రు అంటు పంచగ్రామల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఎన్ని అవాంతరాలు ఎదురైన 15వ తేదీన జాతీయ జెండాను ఆవిష్కరిస్తామని పంచ గ్రామాల ప్రజలు సవాలు చేసారు.

# మానసిక వికలాంగులకు పండ్లు చాక్లెట్లు పంపిణీ



నెల్లూరు . ఆగస్టు 15 :విశ్వమాత సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం మానసిక వికలాంగులకు పండ్లు చాక్లెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. విశ్వమాత సేవా ఫౌండేషన్ సభ్యుడైన చుండూరు సుబ్రహ్మణ్యం సహకారంతో రెడ్ క్రాస్ లో ఉన్న మానసిక వికలాంగుల పిల్లలకు మరియు వారికి సేవలు అందిస్తున్న సిబ్బందికి పండ్లు ,చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వమాత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దుబ్బిశెట్టి కళ్యాణి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయడం అలవర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు . ముఖ్యంగా ముఖ్యంగా జన్మదినోత్సవాలు, వివాహ దినోత్సవాలు తదితర శుభ పరిణామ దినాలలో దాతృత్వం కలిగిన దాతలు ఆయా సంతోషకరమైన మహోత్సవ కార్యక్రమాలను వివిధ ఆశ్రమాలలో ఆశ్రయం పొందుతున్న వికలాంగులు వితంతువులు మానసిక వికలాంగులు వృద్ధులకు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు . సమాజంలో కన్ను కాలు చేతులు అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తున్న సామాన్య మనుషులే కొన్ని విపత్కర ఆపత్కాల పరిస్థితులలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుందన్నారు . ఇటువంటి పరిస్థితులలో శరీరంలోని అవయవాల లోపం ఉన్న మానసిక వికలాంగురోగులు వయోభారంతో ఏ పని చేసుకోలేక ఆశ్రమాల అంచున జీవనం సాగిస్తున్న వారికి మనసున్న దాతలు సహాయ సహకారాలు అందించాలని సూచించారు .. ఈ సేవా కార్యక్రమాలలో భాగంగానే విశ్వమాత సేవా ఫౌండేషన్ సభ్యులైన చుండూరు సుబ్రమణ్యం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన సేవలను కొనియాడారు . ఈ సందర్భంగా అందరికీ 75వ స్వాతంత్ర దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో విశ్వమాత సేవా ఫౌండేషన్ ఫౌండేషన్ సభ్యులైన రాధమ్మ,రవిబాబు, ఉష తదితరులు పాల్గొన్నారు .

# లాభాల పండిస్తున్న మిర్చి



అనంతపురం, ఆగస్టు 14, ఎండు మిర్చి సాగు రైతులకు మంచి లాభాలు తెచ్చిపెడుతోంది. మడకశిర నియోజకవర్గంలో అధిక శాతం మంది రైతులు ఎండు మిర్చి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ప్రతి ఏడాది వేరుశనగ సాగుతో నష్టాలు మూటకట్టుకుంటున్న రైతులు ఎలాగైనా సరే ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మిర్చి సాగువైపు దృష్టిసారించారు. ప్రస్తుతం ఎండు మిరపకు మార్కెట్‌లో మంచ్యి ధర ఉండటంతో బోరుబావుల కింద ఎక్కువ మంది మిరప సాగు చేస్తున్నారు. మడకశిర, అగళి, అమరాపురం, గుడిబండ, రొళ్ల మండలాల్లో ఇప్పటికే 910 ఎకరాలకుపైగా సాగు చేసిన మిరప పంట ఆశాజనకంగా ఉంది. ఎక్కువ మంది రైతులు మిరప సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మిరప పైరు ఒక్కోటి రూ.75 పైసాలు కాగా ఎకరా పంట సాగుకు మిరప పైరుకు రూ.12 వేలు ఖర్చు అవుతోంది. కృషాజలాలకు తోడు భారీ వర్షాలు కురవడంతో చెరువులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. బోరు బావుల్లోనూ నీటి మట్టం పెరగడంతో మిరప పంట సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పంట సాగుకు మిరప పైరు, మందులు, ఎరువులకు రూ.25 వేల వరకు పెట్టుబడి అవుతోంది. మార్కెట్‌లో ప్రస్తుతం 10 కిలోల ఎండు మిరప రూ.2,500 వరకు ధర పలుకుతోంది. తెగుళ్లు సోకకపోతే ఎకరాకు రూ.లక్ష దాకా ఆదాయం ఉంటుందని రైతులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిరప పంటకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తింపజేయడంతో అధిక శాతం మంది రైతులు మిర్చి సాగుపై మరింతగా ఉత్సహం చూపుతున్నారు. వర్షాలకు పంట దెబ్బతింటే ఎకరా మిరప పంటకు రూ.60 వేల చొప్పున బీమా వర్తిస్తోంది.

# మద్దూరులో షర్మిల పర్యటన



రంగారెడ్డి కొడంగల్ నియోజక వర్గం మద్దూరు మండల కేంద్రంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు గ్రామస్థలు ఘన స్వాగతం పలికారు. షర్మిల మాట్లాడుతూ రెండు సార్లు కేసీఆర్ ను ముఖ్యమంత్రి చేస్తే చేసింది మోసమే. రుణమాఫీ అని మోసం...సున్నా వడ్డీకి రుణాలు అని మోసం...పోడు పట్టాలు అని మోసం. నిరుద్యోగ భృతి అని మోసం.. డబుల్ బెడ్ రూం అని మోసం. . ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ ఇచ్చిన హామీలు అన్నీ మోసమే. మాట మీద నిలబడే న్యాయకత్వం తెలంగాణ లో లేదని అన్నారు.మాట మీద నిలబడిన నాయకుడు కేవలం వైఎస్సార్ మాత్రమే. 8 ఏళ్లుగా 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టింపు లేదు. ఉద్యోగాలు లేక నిరుద్యోగుల ఆత్మహత్యలు చేసుకుంటుంటే సోయి లేదు. కేసీఆర్ ఛాతీలో ఉన్నది గుండె కాదు..బండ. 5 వేలు రైతు బందు పేరు చెప్పి రైతులను కేసీఆర్ మోసం చేస్తున్నాడు. వైఎస్సార్ హయాంలో వ్యవసాయానికి 30 వేలు లబ్ది చేకూరే సబ్సిడీ పథకాలు ఉండేవి. ఇప్పుడు అవన్నీ బంద్ పెట్టి ముష్టి 5 వేలు ఇస్తే రైతులు కోటీశ్వరులు అవుతారా. బంగారు తెలంగాణ లో కేసీఆర్ కుటుంబానికి తప్పా ఎవరికి బంగారం కాలేదు. కేసీఆర్ పార్టీ అకౌంట్ లో 860 కోట్లు ఉందంట..వడ్డీ నేలకు 3 కోట్లు వస్తుందట. కేసీఆర్ కి..కేసీఆర్ కాంట్రాక్టర్ కు మెగా కృష్ణా రెడ్డి కి అయ్యింది బంగారు తెలంగాణ. తెలంగాణ లో అప్పు లేని కుటుంబం లేదు. కేసీఆర్ పాలన అంతా దొంగల రాజ్యం..దోపిడీ రాజ్యం. ఎన్నికలు వచ్చినప్పుడు బయటకు రావడం తప్పా..కేసీఆర్ ఫామ్ హౌజ్ కే పరిమితం. ఎన్నికల తర్వాత ప్రజలను బోడ మల్లన్న అంటున్నాడు..బోడి గుండు చేస్తున్నాడు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్షాలు నిద్ర పోతున్నాయి. కేసీఆర్ కు అమ్ముడు పోతున్నాయి. నిజంగా కాంగ్రెస్,బీజేపీ తమ పాత్ర పోషించి ఉంటే మెగా కృష్ణా రెడ్డికే ఎందుకు అన్ని కాంట్రాక్టులు ఎందుకు ఇస్తున్నారు అని అడిగే వారు. ప్రతిపక్షాలు అమ్ముడు పోయాయి. నేను వైఎస్సార్ బిడ్డ గా చెప్తున్న..మాట మీద నిలబడే న్యాయకత్వం తీసుకు వస్తా. సంక్షేమ పాలన తిరిగి తెస్తా. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తా. మహిళ పేరు మీద పేద కుటుంబానికి పక్కా ఇల్లు. . ఇంట్లో ఎంత మంది వృద్దులు ఉ ంటే అందరికీ పెన్షన్. . ప్రతి పేద కుటుంభం పక్షాన వైఎస్సార్ బిడ్డ నిలబడుతుందని అన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుని గా

# గడ్డం వెంకటేష్ గౌడ్

జగిత్యాల జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుని గా కోరుట్ల నియోజకవర్గానికి చెందిన గడ్డం వెంకటేష్ గౌడ్ నియమితులయ్యారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో జరిగిన కార్యక్రమంలో నియమాకపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సంధర్బంగా గడ్డం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ జిల్లా లోని ఓబీసీ లను సంఘటితం చేసి, చైతన్య పరచి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కి కృషి చేస్తానని,, అలాగే ఓబీసీ ల సంక్షేమం , అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు..తన నియమాకనికి సహకరించిన పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి,మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిట్ ప్రచార కమిటి చైర్మన్ మధుయాష్కీ గౌడ్,డిసిసి అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్ ,నాయకులు జువ్వడి నర్సింగ్ రావు, కల్వకుంట్ల సుజిత్ రావు , కొమిరెడ్డి రాములు, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి ఆది శ్రీనివాస్, చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జి మేడిపల్లి సత్యం, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు టి.విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, మరియు జిల్లాలోని ఇతర కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాక్ అధికారులతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమీక్షా సమావేశం

హైదరాబాద్ న్యాక్ అధికారులతో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమీక్షా సమావేశం అయ్యారు. న్యాక్ లో అందిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ కోర్సులపై ఆరా తీసారు. న్యాక్ లో పనిచేస్తున్న ఉ ద్యోగుల సమస్యలపై కూలంకషంగా చర్చించారు. న్యాక్ ఉద్యోగుల సమస్యలపై వారితో చర్చించి సామరస్యంగా పరిష్కరించాలని ఆర్ అండ్ బి సెక్రెటరీ శ్రీనివాస రాజు కు సూచించారు. ఈ సమావేశంలో న్యాక్ డి. జి బిక్షపతి,పిఏస్ ముకుంద్ రెడ్డి పలువురు అధికారులు పాల్గొన్నారు

# జనసేన పార్టీ కార్యాలయంలో రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

నెల్లూరు ఆగస్టు 15 . జనసేన పార్టీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో భారత స్వాతంత్ర్య అమృతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పార్టీ జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ స్థానిక శ్రీహరి నగర్ లోని జిల్లా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ గావించారు.ఈ సందర్భంగా వారు స్వాతంత్రం కోసం పోరాడిన సమరయోధుల స్ఫూర్తితో దేశ ప్రజలందరూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని సింహపురి ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 15న నిర్వహించుకుంటున్న స్వాతంత్ర దినోత్సవాలకు ప్రత్యేక ధీటుగా 2022 ఆగస్టు 15న సోమవారం 75వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఆజాద్గా మహోత్సవాల భాగంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారని తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఎందరో త్యాగమూర్తుల ప్రాణ త్యాగాల ఫలితమే స్వతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో జన్మించి ప్రతి ఒక్కరు 3రంగుల జెండాను గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులుతో పాటు నగర అధ్యక్షుడు సుజయ్ బాబు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్,రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు,జిల్లా ఉపాధ్యక్షులు సుధీర్ బద్దిపూడి,జిల్లా అధికార ప్రతినిధి కలంవాంబు నుధీర్,నగర కార్యదర్శి ఉ మాదేవి అజయ్ బాబు తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా 76వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**:-జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ అంజాద్ బాషా.**



నంద్యాల, ఆగస్టు 15:-జిల్లాలోని స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో 76వ స్వాతంత్ర దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీ అంజాద్ బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం సాయుధ బలగాలు కవాతు నిర్వహించగా మైదానంలో పరేడ్ వాహనంపై పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, ఎం.ఎల్.సి ఇసాక్ బాషా,నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్తర్, వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, మార్కుఫెడ్ చైర్మన్ పి.పి. నాగిరెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ మాబున్నిషా, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లాధికారులు, పుర ప్రముఖులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వీక్షించడానికి పట్టణ వాసులు వందలాది మంది తరలి వచ్చి వేడుకలలను వీక్షించారు. నంద్యాల జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, వడ్డే ఓబన్న, కాదర్ బాద్ నరసింగరావు, బొల్లవరపు వెంకట సుబ్బారెడ్డిల సంతతికి జిల్లా ఇంఛార్జి మంత్రి, జిల్లా కలెక్టర్ శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లా ప్రగతిపై సందేశమిస్తూ నూతనంగా నంద్యాల జిల్లా ఏర్పడిన పిదప.. కలెక్టరేట్ మరియు ఎస్.పి కార్యాలయాల ఏర్పాటుతో పాటు ప్రభుత్వ శాఖల కార్యాలయాలన్నీ త్వరితగతిన జిల్లాలో ఏర్పాటు చేసి ప్రభుత్వ పరంగా పారదర్శకమైన పరిపాలనను అందించేందుకు కృషి చేస్తున్నాం. 2022-23 సంవత్సరంలో డా.వైఎస్ఆర్ రైతు భరోసా కింద మొదటి విడతగా 2 లక్షల 9 వేల మంది రైతు కుటుంబాలకు 157 కోట్ల 12 లక్షల నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. 2019 నుండి ఇప్పటివరకు 942 కోట్ల 72 లక్షల రూపాయలను పెట్టుబడి ఆర్థిక సాయంగా అందచేశామన్నారు. "జగనన్న అమ్మ ఒడి" పథకనీ క్రింద 2021-22 విద్యా సంవత్సరానికి ఒక్కొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున జిల్లాలో అర్హత కలిగిన 1 లక్ష 72 వేల 116 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.224 కోట్ల రూపాయలను జమ చేయడం జరిగిందన్నారు.ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి' అనే నినాదంతో నాడు నేడు క్రింద ప్రతి పాఠశాలలో 9 రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. జగనన్న విద్యా దీవెన' లో 2021-22 మొదటి త్రైమాసానికి 42 వేల 733 మంది విద్యార్థులకు రూ 26.32 కోట్లు, రెండవ త్రైమాసానికి 43 వేల 199 మందికి రూ 25.09 కోట్లు, మూడవ త్రైమాసానికి 43 వేల 422 మందికి రూ 25.64 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమ చేయడం జరిగిందన్నారు. నంద్యాల జిల్లాలో 263 జగనన్న లేఔట్ లలో 46 వేల 139 గృహాలను మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి లక్షా 80 వేల రూపాయలు ఖర్చు చేయనున్నాం. ఇప్పటి వరకు 42 వేల 741 గృహాల నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం కేసీ కెనాల్ కింద 96, 619 ఎకరాలకు, ఎస్ఆర్బిసి కాలువల ద్వారా 1 లక్ష 37 వేల ఎకరాలకు, తెలుగు గంగ ప్రాజెక్టు కింద 1,01,400 ఎకరాలకు, సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 10 వేల ఎకరాలకు, 38 ఎత్తిపోతల పథకాల ద్వారా 55,900 ఎకరాలకు, శివ భాష్యం ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాలకు, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 2900 ఎకరాలకు సాగునీటిని క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది నవంబర్ 30వ తేదీ వరకు సాగునీటిని అందించనున్నామన్నారు. పంచాయితీరాజ్ శాఖ ద్వారా రూ.166 కోట్ల అంచనాతో చేపట్టిన 416 గ్రామ సచివాలయ భవనాలలో 260, రూ.86 కోట్ల అంచనాతో చేపట్టిన 395 రైతు భరోసా కేంద్రాలలో 119,



రూ.49 కోట్ల అంచనాతో చేపట్టిన 285 వై.ఎస్.ఆర్ విలేజ్ క్లినిక్స్ లలో 65 పూర్తయ్యాయని..... మిగిలినవన్నీ వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.27 కోట్ల అంచనాతో చేపట్టిన 168 వైఎస్ఆర్ డిజిటల్ గ్రంధాలయ కేంద్ర భవన నిర్మాణాలు, రూ 18 కోట్ల అంచనాతో చేపట్టిన 103 పాల సేకరణ మరియు శీతలీకరణ కేంద్రాల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం ద్వారా మన భూములు, ఆస్తుల రక్షణకు వివాదాలు లేని స్వచ్ఛమైన భూ రికార్డులను రూపొందించేందుకు ఆదునిక పరిజ్ఞానంతో భూ రీసర్వే పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. ఇప్పటి వరకు మొత్తం 294 గ్రామాలలో డ్రోన్ ఫ్లై సర్వే, 441 గ్రామాలలో రీసర్వే జరుగుతోందన్నారు. 2022 ఏప్రిల్ 4వ తేదీ నుండి ఆగష్టు 12 వ తేదీ వరకు 7141 అర్జీలను స్వీకరించి అందులో 5252 అర్జీలను పరిష్కరించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గౌరవ శాసనసభ్యులు సచివాలయాల వారీగా ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం రూ.20 లక్షల నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.అనంతరం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు ఏర్పాటు చేసిన శకటాలు పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా ప్రజలను ఆకట్టుకున్నాయి. ఇందులో వ్యవసాయ శాఖ ప్రథమ బహుమతి, డ్వామాకు రెండవ బహుమతి, డిఆర్డిఎ,ఎస్ఎస్ఏ,డిఈఓ శాఖలకు మూడవ బహుమతిగా ఎంపికయ్యాయి. ఎక్సిబిషన్ స్టాళ్లలో వ్యవసాయ, ఉద్యాన, ఎపిఎంఐపి శాఖలు బహుమతులు పొందాయి. శాంతినికేతన్, గురురాజ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బహుమతులు పొందాయి. విధుల్లో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు మంత్రి ప్రశంసా పత్రాలు అందచేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ఈ వేడుకల్లో జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, పుర ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఉర్దూ ఘర్ నందు 75వ జాతీయ జెండా ఆవిష్కరించిన మైనార్టీ నాయకులు



ఎమ్మిగనూరు( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉర్దూ ఘర్ నందు జాతీయ జెండా ఆవిష్కరించిన మైనార్టీ నాయకులు, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు చేసిన త్యాగాలు పోరాటాలు ఫలితంగా సిద్ధించిన మన దేశానికి స్వాతంత్ర్య వచ్చిందన్నారు. స్వాతంత్ర్య సాధనకు కృషి చేసిన మహనీయుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుందామని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉర్దూగర్ మైనార్టీ నాయకుడు రియాజ్ అహ్మద్ గారు జామియా మసీద్ ప్రెసిడెంట్ కాశీం బేగ్, రియాజ్ ఆహ్మద్, నజీర్ ఆహ్మద్, ఉమ్మర్ సాబ్, వహీద్, వహాబ్, మన్సూర్ బాషా, సయ్యద్ చాంద్, అబ్రార్, ఆమాన్, యిసాక్, మెకానిక్ బాషా, రజాక్, లియాఖత్, ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి పేదవాడికి 75వ స్వాతంత్ర్య ఫలాలు అందాలిప్రముఖ న్యాయవాది, నోటరీ కె. వెంకటేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు --75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ న్యాయవాది, నోటరీ కె. వెంకటేశ్వర రెడ్డి ఎమ్మిగనూరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలోని తన కార్యాలయం నందు ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రస్తుత ఏపీపీ ఎం. గోపాలకృష్ణ, కోయిలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీ వెంకటేశ్వర్లు సమక్షంలో సీనియర్ సిటిజన్స్, ప్రముఖ వాస్తుశాస్త్ర నిపుణులు ఆలూరు తిమ్మప్ప చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు, ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎందరో త్యాగ మూర్తులు మనకు, మన భావితరాల వారి భవిష్యత్తు కోసం బానిసత్వం నుంచి, ఇతర పెత్తందారులు ఆధిపత్యం నుంచి విముక్తి కోసం వారి, వారి జీవితాలను సమిధలుగా ఆహుతి గావించి నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా, భిన్నత్వం లో ఏకత్వం, సమసమానత్వం, అందరికీ సామాజిక, ఆర్థిక ఫలాలు పంపిణీ వంటి ఎన్నో రకాల జీవనప్రమాణాలు అనుభవించుకోవడానికి సాధించారని, కావున ఈ సందర్భంగా ప్రతి పేదవాడికి స్వాతంత్ర్య ఫలాలు అందాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. జగన్నాథ్ రెడ్డి , ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎక్స్ ఏజీపి ఎం. జి. నర్సి రెడ్డి, మరియు సహ న్యాయవాదులు మురళి కృష్ణ, రామకృష్ణ,కె మల్లికార్జున తిమ్మాపురం రఘు రాం, జూనియర్ న్యాయవాది కె. రంగన్న , మరియు కౌన్సిలర్ వి. జి. దయాకర్ , అసిస్టెంట్, జెఎస్పి మరియు విహెచ్ పిఎస్ తాలుకా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి. సి. నాగరాజు, కె. తిమ్మాపురం గ్రామ టిడిపి నాయకులు హనుమంతు, రంగన్న, నర్సింహులు, మీ సేవ కేంద్రాల సుధాకర్, సత్యనారాయణ, గిరి, గిడ్డా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పెన పాప.. ఇలా అయితే ఎలా?



ఉప్పెన సినిమాతో వెండితెరకు పరిచయమైన కృతి శెట్టి మొదట్లోనే బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడంతో ఒక్కసారిగా ఇండస్ట్రీలో తన స్థాయిని పెంచుకుంది. మొదటి సినిమా విడుదల కాకముందే ఈ బ్యూటీ రెండు సినిమాలకు సైన్ చేసింది. ఉప్పెన షూట్ లో ఉండగానే కొంతమంది నిర్మాతలు అడ్వాన్స్ కూడా ఇచ్చేశారు. అలా తన పాపులారిటీని పెంచుకున్న కృతి శెట్టి ఉప్పెన తరువాత శ్యామ్ సింగరాయ్ సినిమాతో మంచి విజయాన్ని అందుకుంది.ఆ సినిమాలో ఆమె పాత్ర పెద్దగా లేకపోయినప్పటికీ సినిమా సక్సెస్ అయ్యింది కాబట్టి తన రేంజ్ కూడా పెరిగిపోయింది. ఇక ఆ తర్వాత వచ్చిన బంగార్రాజు సినిమా కమర్షియల్గా బాక్సాఫీస్ వద్ద పెట్టిన పెట్టుబడి వెనక్కి తేవడంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇలా వరుసగా లవ్ కమర్షియల్ సినిమాలు సక్సెస్ కావడంతో తమ్ముడు మరిన్ని అవకాశాలు వచ్చాయి.రెండో సినిమాకే కోటికి పైగా డిమాండ్ చేసిన కృతి ఇప్పుడు అంతకంటే ఎక్కువ స్థాయిలోనే కమర్షియల్ సినిమాలకు డిమాండ్ చేసింది. రామ్ పోతినేని తో ఒకే సారి తెలుగు తమిళంలో చేసిన సినిమా ది వారియర్. ఆ సినిమా సక్సెస్ అయితే అటు తమిళంలో కూడా బిజీ అవ్వాలని ప్రణాళికలు రచించింది. కానీ అది వర్కౌట్ కాలేకపోయింది. ఇటీవల వచ్చిన మాచర్ల నియోజకవర్గం సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశ పరిచింది.ఈ సినిమాలో కూడా కృతి తన పాత్రకు ప్రాధాన్యత లేకుండా నటించడం ఆమె అభిమానులకు ఏమాత్రం రుచించలేదు. మొదటి రెండు సినిమాలతో వచ్చిన క్రేజ్ ఇప్పుడు వచ్చిన సినిమాలతో ఆమె డిమాండ్ ను మరింత తగ్గిస్తున్నాయి. మాచర్ల నియోజకవర్గంలో కృతి ఏదో పాటలకే పరిమితం చేయడం సరిపోయింది.దర్శకుడు ఎమ్మెస్ రాజశేఖర్ రెడ్డి ఏదో మ్యాజిక్ క్రియేట్ చేస్తారు అనుకుంటే రొటీన్ కమర్షియల్ ఫార్ములకు ఏ మాత్రం తక్కువ కాకుండా తన ఎడిటర్ తెలివిని వదాడు. కానీ కంటెంట్ లో పస లేకుంటే స్క్రీన్ ప్లే తో ఎంత మ్యాజిక్ చేసినా వర్కౌట్ కాదని అర్థమయ్యింది. చాలా సన్నివేశాలతో చిరాకు తెప్పించాడు. ఏదేమైనప్పటికీ కూడా బాక్సాఫీస్ వద్ద కృతి దారుణమైన డిజాస్టర్ ఎదుర్కోనుంది. మరి రాబోయే ప్రాజెక్టులు ఏమవుతాయో చూడాలి.

# మెల్ బోర్న్ లో మిల్కీ మెరుపులు విరుపులు!

ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్ బోర్న్ 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈరోజు ముందుగా ఆస్ట్రేలియాలోని మెల్ బోర్న్ లోని ఐకానిక్ ల్యాండ్ మార్క్ వేదికపై భారతీయ సినిమా తారల శ్రేణి అధికారికంగా పండుగను ప్రారంభించింది. రెండేళ్లుగా కరోనా క్రైసిస్ ఆటంకం వల్ల ఆన్ లైన్ లో నిర్వహించిన ఈ ఉత్సవాన్ని ఈసారి ఘనంగా లైవ్ లీగా నిర్వహిస్తున్నారు. ఆగస్ట్ 12 నుండి ఆగస్ట్ 20 వరకు జరగనున్న ఈ ఉత్సవానికి గొప్ప తారాగణం సహా ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.అభిషేక్ బచ్చన్- తాప్సీ పన్ను- వాణి కపూర్ - షెఫాలీ షా- గాయని సోనా మొహపాత్ర సహా దర్శకనిర్మాతలు అనురాగ్ కశ్యప్ - కబీర్ ఖాన్- అపర్ణా సేన్ - నిఖిల్ అద్వానీ- రిత్విక్ ధంజనీ-షూజిత్ సిర్కార్ అధికారిక లాంచింగ్ కార్యక్రమానికి హాజరయ్యారు.ఒతమందిలో దక్షిణాది కథానాయిక తమన్నా భాటియా ఎంతో ప్రత్యేకంగా ఈ వేదిక వద్ద ప్రత్యక్షమైంది. అభిషేక్ బచ్చన్- తమన్నా భాటియా- తాప్సీ పన్ను అధికారికంగా ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్ బోర్న్ ను జెండా ఊపి ప్రారంభించారు. 120కి పైగా చిత్రాల ప్రదర్శనతో పాటు .. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించనుండడం ఈ వేదిక వద్ద ఆసక్తిని పెంచుతోంది. ఫెస్టివల్ లో సౌత్- హిందీ ఫిల్మ్ డిబేట్ గురించి ఒక ప్రశ్నకు సమాధానంగా తమన్నా భాటియా మాట్లాడారు. మిల్కీ స్పందిస్తూ "ఈ సంభాషణ భారతదేశానికి మాత్రమే యూనిక్. నేను విదేశాలకు వెళ్లినప్పుడల్లా వ్యక్తుల (ఉత్తరాది దక్షిణాది) మధ్య తేడా గురించి ఏదైనా అనడం నేను ఎప్పుడూ వినలేను. విదేశీయులు దానిని భారతీయ సినిమా అని పిలుస్తారు. ఇక్కడ ఎఈఈఓ కూడా అలాంటిదే. ఇటీవల పాన్ ఇండియా చిత్రాలను చూడాలని ప్రేక్షకులు కోరుకుంటున్నారు. అలాంటి మరిన్ని కంటెంట్ ఉన్న సినిమాలను తెరకెక్కిస్తున్నారు. వాటిని అందరూ మెచ్చుకుంటారు!" అని అన్నారు.మెల్ బోర్న్ ఫిల్మ్ ఫెస్టివల్ లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం తమన్నాను ఈ ఏడాది వెతుక్కుంటూ రావడం ఆసక్తికరం. ఈ వేడుకల్లో తమన్నా భారతీయత ఉట్టిపడేలా అందమైన చీరలో కనిపించింది. గ్రీన్ కలర్ చీర- డిజైనర్ బ్లౌజ్ లో సమ్మోహనకర పోజులతో మిల్కీ సైరన్ దేశీ అవతార్ లో అదిరే ట్రీటిచ్చింది.ఈ లుక్ కి మెల్ బోర్న్ మెరుపుల మెరిసే దానా! అంటూ యూత్ ఫిదా అయిపోతున్నారు. తమన్నా నటించిన తాజా బాలీవుడ్ చిత్రం 'బబ్లీ బౌన్సర్' త్వరలో విడుదల కానుంది. మధుర్ భండార్కర్ ఈ చిత్రానికి దర్శకుడు. ఈ చిత్రాన్ని మెల్బోర్న్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శించనున్నారని తెలిసింది.

# అనిల్ రావిపూడి మూవీ దిల్ రాజు ఎందుకు మిస్సయ్యాడు!



టాలీవుడ్ లో రైటర్ గా 'శంఖం' సినిమాతో కెరీర్ ప్రారంభించారు యంగ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఆ తరువాత 'పటాస్'తో డైరెక్టర్ అయ్యారు. ఈ మూవీ నుంచే అనిల్ రావిపూడి - దిల్ రాజుల మధ్య మంచి అనుబంధం మొదలైంది. 'పటాస్'ని దిల్ రాజు నిర్మించకపోయినా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పంపిణీ చేశారు. అదే అనుబంధంతో అనిల్ కు 'సుప్రీమ్'ని డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చారు. అక్కడి నుంచి అనిల్ రావిపూడి బయటి నిర్మాతకు సినిమా చేయలేదు.అనిల్ - దిల్ రాజుల కాంబినేషన్ లో 'సుప్రీమ్' నుంచి 'ఎఫ్ 3' వరకు ఐదు సినిమాలొచ్చాయి. మధ్యలో సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'సరిలేరు నీకెవ్వరు' మూవీకి అనిల్ సుంకర నిర్మాత అయినా అనిల్ కోసం అనిల్ సుంకర కోసం ఈ మూవీకి సమర్పకుడిగా వ్యవహరించి ఈ మూవీని బన్నీ మూవీ 'అల వైకుంఠపురములో'తో పోటీ వున్నా సేఫ్ గా రిలీజ్ చేశారు. అంటే 'పటాస్' నుంచి 'ఎఫ్ 3' వరకు అనిల్ - దిల్ రాజుల అనుబంధం ప్రతి సినిమా విషయంలోనూ కొనసాగుతూ వచ్చింది.అనిల్ సినిమాలకు ప్రత్యక్షంగా కొన్ని సార్లు పరోక్షంగా దిల్ రాజు భాగస్వామి అవుతూ వచ్చారు. కానీ తొలిసారి దిల్ రాజు అసోసియేట్ కాకుండానే అనిల్ రావిపూడి సినిమా పట్టాలెక్కడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బాలయ్యతో ఆయన 108వ ప్రాజెక్ట్ గా అనిల్ రావిపూడి ఓ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ని చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ ని షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్స్ సాహు గారపాటి. హరీష్ పెద్ది నిర్మించబోతున్నారు.అయితే ఈ ప్రాజెక్ట్ కి వీరిద్దరు ప్రొడ్యూసర్స్ అయినా దిల్ రాజు కూడా వన్ ఆఫ్ ది పార్ట్నర్ గా చేరాలని ప్లాన్ చేశారట. అయితే దొరక్క దొరక్క దొరికిన పెద్ద హీరో ప్రాజెక్ట్ కావడం తమని ఎక్కడ దిల్ రాజు డామినేట్ చేసేస్తాడోనని షైన్ స్క్రీన్స్ వారే తెలివిగా దిల్ రాజుని పక్కకు తప్పించారని అయినా సరే అనిల్ - బాలయ్య 108 ప్రాజెక్ట్ లో తానూ వుండాల్సిందేనని చివరి నిమిషం వరకు దిల్ రాజు తీవ్రంగా ట్రై చేశారట. అంతే కాకుండా బాలయ్యతో ఇంత వరకు సినిమా చేయలేదన్న లోటు కూడా ఈ మూవీతో తీరిపోతుందని ప్లాన్ చేశాడట.. కానీ అదివర్కవుట్ కాలేదని నిర్మాతలే పడనీయలేదని ఇన్ సైడ్ న్యూస్.

# చెన్నైతో జడేజా 'బంధం' తెగినట్టేనా..! ఫ్రాంచైజీతో దూరం పాటిస్తున్న జడ్డూ..



టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఐపీఎల్‌లో పదేండ్ల పాటు చెన్నై సూపర్ కింగ్స్‌తో ఉన్న అనుబంధాన్ని అనధికారికంగా తెంచుకున్నాడా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. రెండు నెలల క్రితం ముగిసిన ఐపీఎల్-15 సీజన్ తర్వాత జడేజా.. తిరిగి చెన్నై ఫ్రాంచైజీతో పూర్తిగా 'సంబంధాలు' తెంచుకున్నాడని తెలుస్తున్నది. జడేజా.. 2012 నుంచి సీఎస్కేతో ఆడుతున్నాడు.టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన కథనం మేరకు.. ఐపీఎల్-15 తర్వాత జడేజా మళ్లీ చెన్నైతో టచ్‌లో లేడు. ఈ సీజన్‌కు ముందు సీఎస్కేకు సారథిగా నియమితుడైన అతడు.. 8 మ్యాచ్‌ల తర్వాత వైదొలిగాడు. జడేజాను ఒక 'విఫల ప్రయోగం'గా చెన్నై యాజమాన్యం చిత్రీకరించింది. ఆ సమయంలోనే మొదలైన విబేధాలతో జడేజా మనస్తాపం చెందాడని అప్పట్నుంచీ పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. ఆ తర్వాత జడ్డూ.. తన ఇన్‌స్టాగ్రామ్‌లో 'చెన్నైతో ఉన్న జ్ఞాపకాల'ను తుడిపేసుకోవడం (పోస్టులను డిలీట్ చేశాడు)తో వీళ్ల మధ్య విబేధాలు నిజమేనని అభిమానులు నిర్ధారణకు వచ్చారు.తాజా సమాచారం ప్రకారం.. ఐపీఎల్-15లో గాయం కారణంగా చెన్నై ఆడిన చివరి నాలుగు మ్యాచ్‌లు ఆడకుండానే వెళ్లిన జడేజా.. అప్పట్నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో గానీ ఆఫ్‌లైన్‌లో గానీ ఫ్రాంచైజీతో టచ్‌లో లేడని సన్నిహిత వర్గాల సమాచారం. తన గాయం ఎలా ఉంది..? అనే విషయాన్ని కూడా జడేజా చెన్నైతో చెప్పలేదట. ఐపీఎల్ ముగిసినప్పట్నుంచి ఆ దూరాన్ని కొనసాగిస్తున్నాడట.తాజా పరిణామాలు చూస్తుంటే చెన్నై-జడేజా బంధం తెగినట్టే అని తెలుస్తున్నది. వచ్చే సీజన్‌లో మరో ఫ్రాంచైజీతో జట్టు కట్టేందుకు జడేజా సిద్ధమవుతున్నాడని టాక్ వినిపిస్తోంది. మరోవైపు చెన్నై మాత్రం చివరి నిమిషం వరకు ఏదో అద్భుతం జరగకపోదా..? విబేధాలు సమసిపోకపోతాయా..? అని ఆశతో ఉంది. మరి చెన్నై ఆశలు నిజమవుతాయో, జడ్డూ పంతం ఫలిస్తుందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# రోహిత్‌ను దాటేసిన కివీస్ బ్యాటర్.. టీ20ల్లో నయా రికార్డ్

టీమిండియా సారథి రోహిత్ శర్మ రికార్డును కివీస్ ఓపెనర్ మార్టిన్ గప్తిల్ బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రోహిత్ శర్మ (3487 రన్స్)ను గప్తిల్ దాటేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో 15 పరుగులు చేసిన గప్తిల్.. మొత్తంగా టీ20 క్రికెట్‌లో 3497 పరుగులతో రోహిత్ రికార్డును బద్దలు కొట్టాడు.ప్రస్తుతం గప్తిల్, రోహిత్ తర్వాత టీమిండియా స్టార్ బ్యాటర్, మాజీ సారథి విరాట్ కోహ్లీ (3308 రన్స్) ఉన్నాడు. త్వరలోనే ఆసియా కప్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ర్యాంకుల్లో మళ్లీ మార్పులు వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**